సాక్షి
తిరుపతి
శనివారం ၊ 16 ၊ సెప్టెంబర్ ၊ 2023



విశ్రాంత ఉద్యోగులకూ ఇంటి స్థలం

టీటీడీ ఉద్యోగులతోపాటు రిటైర్డ్ అయిన వారికి సైతం ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు భూమన తెలిపారు. - IIలో



దారి కాచిన మృత్యువు

తవణంపల్లె మండలం తెల్లగుండ్లపల్లె సమీపంలో బుధవారం ఆయిల్ ట్యాంకర్, అంబులెన్స్ ఢీకొన్నాయి. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	34	24
తిరుమల	30	21
గూడూరు	38	27
నగరి	35	25

న్యూస్‌రీల్

తిరుపతి జిల్లా జేసీఎస్ కో- ఆర్డినేటర్ల నియామకం

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్లుగా యల్లంటి సనత్‌కుమార్, వెంకటనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు బీఎల్ విద్యార్థులు డిబార్

ఏర్పేడు : అంజిమేడు ఈశ్వర్‌రెడ్డి న్యాయ కళాశాలలో నిర్వహిస్తున్న ఫోర్త్ సెమిస్టర్ టాక్సేషన్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను శుక్రవారం డిబార్ చేశారు. కళాశాలలో మాల్‌ప్రాక్టీస్ జరుగుతున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డికి ఫిర్యాదు రావడంతో వెంటనే తనిఖీ చేయాల్సిందిగా తహసీల్దార్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఈ మేరకు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డారు.

ఆలయ అభివృద్ధే అందరి ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయ అభివృద్ధే అందరి ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో అజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారి సన్నిధిలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. భక్తుల సేవే పరమావధిగా పాలక మండలి విధులు నిర్వర్తించాలని సూచించారు. సులభతరంగా, సజావుగా దర్శనమయ్యేలా ఆలయ సిబ్బంది కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

రూ.500 కోట్ల ఆదాయమే లక్ష్యం

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో కార్గో ద్వారా రూ.500 కోట్ల ఆదాయం రాబట్టడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆర్టీసీ బోర్డు, కార్గో డెవలప్‌మెంట్ స్టేట్ కమిటీ డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం కమిటీ సభ్యులు కేవీ రమణ, సురేష్‌బాబు, రాజశేఖర్‌తో కలిసి ఆయన రెండు రోజుల పర్యటనలో భాగంగా విచ్చేశారు. ముందుగా తిరుపతి బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌ను పరిశీలించారు. జిల్లా ఆదాయం గత ఏడాది రూ.2.5 కోట్లు కాగా, ఈ ఏడాది రూ.5 కోట్లు వచ్చేలా పనిచేయాలని కోరారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్, డీఎం బాలాజీ, ఏటీఎం రామచంద్రనాయుడు, కార్గో జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు పదోన్నతి

తిరుపతి లీగల్: రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న 27 మంది సీనియర్ సివిల్ జడ్జిలకు అదనపు జిల్లా జడ్జీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పీలేరు సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఎం.శ్రీనివాసులు నాయక్కు పదోన్నతి ఇస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జిగా టీ.రామచంద్రుడును నియమిస్తూ తెలిపింది. బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులు 29 లోపు ఆయా ప్రాంతాల్లో బాధ్యతలను చేపట్టాలని సూచించింది.

వెనామీ అధరహో!

ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది. కౌంట్‌కు తగ్గట్టు రేట్లను నిర్దేశిస్తోంది. గిట్టుబాటు దక్కేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. సాధికారత కమిటీ సారథ్యంలో ప్రాసెసింగ్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ప్రతి నెలా కొత్త ధరలను నిర్ణయిస్తోంది. వరుస నష్టాలతో కునారిల్లుతున్న రొయ్యల సాగును ఆదాయం మార్గంలోకి తీసుకువస్తోంది. ముందుచూపుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలను రైతాంగం అభినందిస్తోంది.



వెనామీ రొయ్యలు

- ఆక్వా రంగానికి అండగా ప్రభుత్వం
- వివిధ ప్రోత్సాహకాలతో సహకారం
- విదేశీ ఎగుమతులకు అనుమతులు
- ప్రాసెసింగ్ కంపెనీలతో ఒప్పందాలు
- లాభాల పంట పండిస్తున్న రొయ్యల రైతులు

వాకాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆక్వా పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. ఆర్థిక ప్రోత్సాహకాలతో రొయ్యల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా వెనామీ రొయ్యల ఎగుమతులకు అన్ని దేశాల అనుమతులు సాధించడంలో ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. ఈ క్రమంలో వెనామీ రొయ్యలకు రెట్టింపు ధర పలుకుతోంది.

గిట్టుబాటు దక్కేలా..!

ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రొయ్యలు సాగు చేసే రైతులకు విద్యుత్ బిల్లుల్లో రాయితీ అందిస్తోంది. కౌంట్ ప్రకారం రేట్లు పెంచేలా ప్రాసెసింగ్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా గత మూడు నెలల్లో రొయ్యల ధరలు పుంజుకున్నాయి. ప్రధానంగా వెనామీ రొయ్యలు అధరహో అనిపించే రీతిలో రైతులకు లాభాలు కురిపిస్తున్నాయి. ఈ మేరకు ఇటీవల అమరావతిలో ప్రాసెసింగ్ కంపెనీలు, ఎగుమతిదారులతో ఆక్వా సాధికారత కమిటీ భేటీ అయ్యింది. మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాసెసింగ్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మన రాష్ట్రంలో పండించే రొయ్యలను ఇతర దేశాల్లో మార్కెటింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టారు. అలాగే రొయ్యల కౌంట్‌కు తగ్గట్టు రేట్లను నిర్దేశించారు. ప్రతి నెలా కొత్త ధరలను నిర్ణయించాలని స్పష్టం చేశారు.



కొండూరు వద్ద వెనామీ రొయ్యల గ్రేడింగ్ (ఫైల్)



తూపిలిపాళెం వద్ద ఆక్వా సాగు

జిల్లాలో ఆక్వా సాగు

జిల్లాలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని సుమారు 15 వేల ఎకరాల్లో సుమారు 450 మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం 9 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేపట్టారు. ఏటా దాదాపు 40 వేల టన్నుల ఆక్వా ఉత్పత్తులను సాధిస్తున్నారు. 4 ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని రైతులు, కార్మికులకు ఆక్వా రంగా సుమారు 30 ఏళ్లగా ఉపాధి కల్పిస్తోంది. అలాగే విదేశీ మారక ద్రవ్యాన్ని తీసుకువస్తోంది.

ఇతర రాష్ట్రాలకంటే మిన్నగా

దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే కౌంట్‌ల వారీగా ధరలు ప్రకటిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో పూర్వం నుంచి కొనసాగుతున్నట్టుగా ప్రతి 10 కౌంట్లకి ఒక ధర చొప్పున నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఏపీలోనే రొయ్యల ధరలు మెరుగ్గా ఉన్నాయి. దీంతో జిల్లా ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల కౌంట్ల ధరల వివరాలు

కౌంటు	పాత ధర	కొత్త ధర
20	580	610
25	450	460
30	405	425
35	365	385
40	400	405
45	350	320
50	300	310
55	290	300
60	280	290
65	275	285
70	270	280
75	260	270
80	260	270
85	270	275
90	250	260
95	240	255
100	220	250

సకాలంలో చర్యలు



పంబలి గ్రామం వద్ద 10 ఎకరాల్లో రొయ్యల సాగు చేపట్టా. ఇదివరకు మన ప్రాంతంలో పండించే రొయ్యలను సక్రమంగా మార్కెటింగ్ చేయకపోవడంతో ధరలు తక్కువగా ఉండేవి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సకాలంలో ధరలు పెంచేందుకు చర్యలు తీసుకోవడంతో ఎకరాకు రూ.లక్ష వరకు మిగులుతోంది.

– కోట రమేష్, రావిగుంటపాళెం, వాకాడు మండలం

ధరలు పెంచేందుకు చర్యలు



రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ధరలు పెంచేందుకు చర్యలు చేపడుతోంది. దేశంలో మన రాష్ట్రంలో మాత్రమే ప్రతి కౌంట్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా పెంచాం. దీంతో రైతులకు చాలా మేలు చేకూరుతోంది. ఇదివరకటి నష్టాలను పూడ్చుకునే వెసులుబాటు వస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– ఆర్.రాజేష్, ఫిషరీస్ ఏడీ, గూడూరు

తాగునీటికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ తదితరులు

- కుప్పంకు హంద్రీ–నీవా నీటిని తీసుకురావడమే లక్ష్యం
- కైగల్ నదిపై రూ. 20.50 కోట్లతో రిజర్వాయర్

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో భాగంగా హంద్రీ–నీవా పనులను పూర్తి చేసి త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె, వి.కోట మండలాలకు తాగునీరు అందించేందుకు కైగల్ నదిపై రిజర్వాయర్ నిర్మించేందుకు రూ. 20.50 కోట్లకు, పాలారు నది వద్ద చెక్ డ్యామ్‌లు నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు వెల్లడించారు. పలమనేరుకు తాగునీటిని అందించేందుకు గాను నలగాంపల్లి వద్ద గంగమ్మ శిరస్సు వంకపై రిజర్వాయర్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద వైఎస్సార్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి యమనూరు వద్ద రిజర్వాయర్‌కు నీటిని అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు, మట్టి వినాయకులను పూజించే పోస్టర్లను మంత్రులు ఆవిష్కరించారు. కారుణ్య నియామకాల్లో భాగంగా 31 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు.

ప్రతి పంట ఈ– క్రాప్ నమోదు

పతి పంటను ఈ–క్రాప్ నమోదు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి కోరారు.

విప్లవాత్మకంగా వైద్యరంగం అభివృద్ధి



తిరుపతి తుడా : విప్లవాత్మకంగా వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం విజయనగరం జిల్లా నుంచి రాష్ట్రంలో 5 మెడికల్ కాలేజీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియం నుంచి టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒకే సారి ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించడమంటే చరిత్ర సృష్టించడమేన్నారు. దీంతో యూజీ, పీజీ సీట్లు అమాంతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర విద్యార్థులు ఇదో సువర్ణావకాశమని తెలిపారు. ఈ సందర్భంగా కేరళకు చెందిన పీజీ విద్యార్థిని డాక్టర్ ఐశ్వర్య వర్చువల్ విధానంలో సీఎం సభను ఉద్దేశించి మాట్లాడారు. జగనన్న వైద్య రంగంలో తీసుకొస్తున్న మార్పులు, చర్యలు కొత్త పుంతలు తొక్కుతున్నాయన్నారు. ఇంటింటికీ వైద్యం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. డాక్టర్లకు భద్రతాభావ వాతావరణం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాతా శిశు మరణాలు అరికట్టడంలో ప్రభుత్వం విజయం సాధించిందని ప్రశంసించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బ్యానర్‌ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్సీ, మేయర్ ఆవిష్కరించారు.



ముఖ్యమంత్రితో వర్చువల్ సమావేశంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, కలెక్టర్, ఎమ్మెల్సీ, మేయర్



జగనన్న ఆరోగ్య సురక్ష బ్యానర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కానిస్టేబుల్‌కు చేయూత



కానిస్టేబుల్ రణధీర్‌కు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఇటీవల పుంగనూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడిలో కన్ను కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండగా నిలిచారు. ఆయన శుక్రవారం చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డితో కలిసి తిరుపతి మారుతీనగర్‌లోని తన నివాసంలో కానిస్టేబుల్ రణధీర్‌తో పాటు కుటుంబ సభ్యులకు భాస్కర్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల చెక్కు అందజేశారు. పోలీసులకే టీడీపీ దౌర్జన్యకారుల నుంచి రక్షణ లేకుండా పోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

– తిరుపతి మంగళం

లక్షణంగా మట్టి గణపతి

- పర్యావరణ హితంగా ప్రతిమలు
- చంద్రగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ పంపిణీ
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి



మట్టి వినాయక విగ్రహాలను పరిశీలిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : పర్యావరణ హితమే లక్ష్యంగా మట్టి గణపతి ప్రతిమలను చంద్రగిరి నియోజకవర్గంలో ఉచితంగా పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చర్యలు చేపట్టారు. 11 ఏళ్లుగా లక్షలాది మట్టి వినాయకుని విగ్రహాలను తయారు చేయించి అందించినందుకు ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఆయనకు ప్రత్యేక పురస్కారం సైతం గత ఏడాది బహూకరించడం విశేషం. అదే క్రమంలో ఈ ఏడాది కూడా ఆయన దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలోని లక్ష కుటుంబాలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. సుమారు 430 మంది నిపుణులైన కార్మికులు 25 రోజులపాటు శ్రమించి మట్టి ప్రతిమలను తీర్చిదిద్దారు. ఇందుకోసం సుమారు 2వేల టన్నుల బంక మట్టి వినియోగించారు. విగ్రహాల పంపిణీలక్ష 2వేల మంది వలంటీర్లు సేవలందించనున్నారు. అలాగే వినాయక పూజా విధానాన్ని తెలియజేసే పుస్తకాలను అందించనున్నారు.

మోహిత్‌రెడ్డి పరిశీలన

మట్టి గణపతి ప్రతిమల తయారీని శుక్రవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరిశీలించారు. వినాయకచవితి ముందురోజున పంపిణీకి అనుకూలంగా ఆయా ప్రాంతాలకు విగ్రహాలను తరలించాలని ఆదేశించారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతులమీదుగా ప్రతిమ పంపిణీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఆనందంగా ఉంది

కాలుష్యపు కోరల నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలను తయారు చేయించి ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తున్నాం. ఎంతో బాధ్యతగా పర్యావరణ రక్షణకు నడుం బిగించాం. పదేళ్లకు పైగా ఇంటింటికీ ఉచితంగా విగ్రహాలను అందించడం ఆనందంగా ఉంది.

– చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్



శ్రీవారి ఆలయం ఎదుట బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం



నివాళి అర్పిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: ఇంజినీరింగ్ వ్యవస్థకే వన్నె తెచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఆదర్శనీయమని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు కొనియాడారు. మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి సందర్భంగా తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ పద్మాజనార్దన్ రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరాజు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా సుపరిపాలన



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి) : రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. శుక్రవారం బాలాయపల్లె మండలం మన్నూరు పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఇరువురు నేతలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎంపీ మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న ముందుకు సాగుతున్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు కొనియాడారు. మన్నూరుమిట్ట వాసుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాకపోకలకు వీలుగా వంతెన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మురళీరెడ్డి పాల్గొన్నారు.

వాస్తవాలను వక్రీకరిస్తే సహించం

వెంకటగిరిరూరల్ : ఎల్లో మీడియా వాస్తవాలను వక్రీకరించి విష ప్రచారం చేస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని బంగారుపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు తెలుపుకునేందుకు వస్తే, ఎల్లోమీడియా ఆధ్వర్యంలో కొందరు సామాజిక మాధ్యమాల్లో ఎడిట్ వీడియోలను పోస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనసులను కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటగిరివాసుల కలను సాకారం చేస్తూ పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారన్నారు. జాతరను వైభవోపేతంగా నిర్వహించేందుకు బుధవారం ఎన్‌జేఆర్ భవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహిస్తే, తలుపులు వేసుకుని మీటింగ్ పెట్టుకున్నామని దుష్ప్రచారం చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకే దిగజారుడు పనులు చేస్తున్నారని ఆరోపించారు. మంచిని మంచిగా చూపాలని, అసత్య కథనాలు వండి వార్చడం మానుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, విప్ పూజారి లక్ష్మి, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, కౌన్సిలర్లు సుబ్బారావు, శ్రీనివాసులు, వహీదా, కల్యాణి పాల్గొన్నారు.

టీటీడీ విశ్రాంత ఉద్యోగులకూ ఇంటి స్థలం



శ్రీనివాస సేతును పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా: టీటీడీ ఉద్యోగులతో పాటు విశ్రాంత సిబ్బందికి కూడా ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీనివాససేతు వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరులో ఎవరినీ అసంతృప్తికి గురి చేయమన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18వ తేదీన పట్టు వస్త్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా టీటీడీ భాగస్వామ్యంతో రూ. 650 కోట్లు వెచ్చించి నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. వంతెనపై 19వ తేదీ నుంచి వాహనాల రాకపోకలను అనుమతించనున్నట్లు వివరించారు. అలాగే టీటీడీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇంటి స్థలాలు పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం అదనంగా మరో 200 ఎకరాలు సేకరించనున్నట్లు వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా తొలుత తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ముఖ్యమంత్రి దర్శించుకుని తిరుమలకు బయలుదేరి వెళతారని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ శిరీష, టీటీడీ జేఈఓ సదా భార్గవి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్ సంస్థ మేనేజర్ రంగ స్వామి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి పరిశోధనల ఫలితాలు



మాట్లాడుతున్న వెస్ట్‌బెంగాల్ వెటర్నరీ వర్సిటీ వీసీ దాణా

తిరుపతి సిటీ: ఎస్వీయూలో చేపట్టిన పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలని వెస్ట్‌బెంగాల్ వెటర్నరీ వర్సిటీ వీసీ ఎస్ఎస్ దాణా పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో సుస్థిర గ్రామీణ జీవనోపాధి సాధనపై రెండు రోజులుగా సాగుతున్న జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సుకు పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. జాతీయ సదస్సులతో గ్రామీణ ప్రజల సమస్యలను, అవసరాలనుతెలుసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించవచ్చని వెల్లడించారు. ప్రధానంగా పశువైద్య శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం, సూచనలు అందించినప్పుడే సుస్థిర జీవనోపాధిని అందించగలమని స్పష్టం చేశారు. అనంతరం రైతులు, యువ పారిశ్రామిక వేత్తలు తమ ఆవిష్కరణలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు. అసోసియేట్ డీన్ జగపతి రామయ్య, వెటర్నరీ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ కె.వీరబ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ జీఆర్‌కే శర్మ పాల్గొన్నారు.

పట్టుగూళ్ల ఒడుపులో కొత్త టెక్నాలజీ



జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. సామాన్య రైతుగా పట్టుగూళ్ల ఒడుపులో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. నాణ్యతలేని పత్తి గూళ్లను మార్కెట్‌లో ఆశించినంత ధరకు విక్రయించలేక సతమతమయ్యాం. దీనిపై ఆలోచించి హారిజాంటల్ కుకున్ హార్వెస్టర్ అనే పరికరం కనిపెట్టా. దీంతో ఆకు గూళ్లను సులభతరంగా శుభ్రం చేసి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో మంచి ధరలకు విక్రయించవచ్చు. యంత్రం విలువ రూ.40వేలు, రిపేర్లు ఉండవు. మోటార్ బైక్, విద్యుత్, చేతితో యంత్రాన్ని ఆపరేట్ చేయవచ్చు. రోజుకు సుమారు 600కేజీల వరకు పట్టుగూళ్లు శుభ్రపరచవచ్చు.

- గాంధ్ల గురుమూర్తి, రైతు, పలమనేరు

చెరువుల ప్రక్షాళనకు చైన్ డ్రాగింగ్



రొయ్యలచెరువుల ప్రక్షాళనకు చైన్ డ్రాగింగ్ యంత్రం ఎంతో ఉపయోగకరం. రొయ్య పిల్లలను చెరువులో వదిలే 2 నెలల ముందు ఈ యంత్రంతో రెండు మార్లు డ్రాగింగ్ చేయడంతో బ్యాక్టీరియా, ఫంగస్ నశించిపోతాయి. దీంతో పాటు ఆక్సిజన్ పూర్తి స్థాయిలో రొయ్యలకు అందుతుంది. ఆరోగ్యకరమైన పంట రైతులకు దక్కుతుంది. ఈ యంత్రానికి గాను మాకు పేటెంట్ హక్కు కూడా లభించింది.

- తౌషిక్ అహ్మద్, ఫ్యాకల్టీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నాయుడుపేటటౌన్ : మండలంలోని గొట్టిప్రోలు పాఠశాలలో నాలుగు గ్యాస్ సిలిండర్లు, వంట పాత్రలను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మే 21 తేదీన జరిగిన ఈ చోరీపై ప్రధానోపాధ్యాయుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో పండ్లూరు గ్రామానికి చెందిన బి.సంజు, నాయుడుపేటకు చెందిన వి.ప్రసాద్ చోరీ చేసిన వస్తువులను విక్రయించేందుకు తరలిస్తుండగా సీఐ నరసింహారావు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

తిరుమలలో రెండు పార్కులు ప్రారంభం



జీఎన్‌సీ వద్ద పార్కు ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల సుందరీకరణలో భాగంగా దాత వీవీ.రవికుమార్ సహాయంతో ఫిల్టర్ హౌస్ వద్ద, జీఎన్సీ వద్ద అభివృద్ధి చేసిన రెండు పార్కులను శుక్రవారం రాత్రి టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ప్రారంభించారు. ఇక్కడి ఫౌంటెన్‌లో అన్నమయ్య సంకీర్తనలు వినిపించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. పార్కు అభివృద్ధికి రూ. 8 లక్షలు, ఐదేళ్ల పాటు నిర్వహణకు రూ.30 లక్షలను దాత అందించారు. జీఎన్సీ వద్ద రూపొందించిన పార్కులో 65 హై ఎండ్ ప్రాజెక్టెడ్ లైట్లు, శంకు చక్ర నామాలతో కూడిన ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఈ పార్కు అభివృద్ధికి రూ.15 లక్షలు, ఐదేళ్ల నిర్వహణ కోసం రూ.80 లక్షలను దాత అందించారు. జేఈఓ వీరబ్రహ్మం, ఎస్2–2 జగదీశ్వర్‌రెడ్డి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు, ఈఈ శ్రీహరి, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కోట : మండలంలోని ఊనుగుంటపాళెంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన కయ్యాల శ్రీనివాసులు(54) ఇంట్లో మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మార్గనిర్దేశకుడు 'మోక్షగుండం'



విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశంలోని ఇంజినీర్లకు మార్గనిర్దేశకుడని కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొనియాడారు. శుక్రవారం తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఇంజినీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మోక్షగుండం సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, క్వాలిటీ కంట్రోల్ జిల్లా అధికారులు శంకర్ నారాయణ, విజయకుమార్, శంకరయ్య నేతృత్వంలో ఇంజినీర్లు కమిటీగా ఏర్పడి మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు.ఇంజినీర్లు సత్యనారాయణరెడ్డి, గిరిధర్, రఘురామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

తిరుపతి కల్చరల్ : పర్యావరణానికి మేలు చేసేలా మట్టి గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తుడా మైదానం ఇండోర్ స్టేడియంలోని శ్రీవర సిద్ధి వినయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించారు. వినాయక సాగర్‌లో నిమజ్జనానికి సర్వం సిద్ధం చేసినట్లు వివరించారు. వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పసికందు మృతదేహం లభ్యం

పెళ్లకూరు : మండలంలోని దిగువచావలి సమీపంలో శుక్రవారం ఓ పసికందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శిశువు మృతదేహాన్ని కుక్కలు సగభాగం తినేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. తుడికి భార్య, పిల్లలు ఉన్నారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

దారికాచిన మృత్యువు

మొదలే అనారోగ్య సమస్యలు. పెనిమిటి ప్రాణం నిలుపుకోవాలని ఆ ఇల్లాలు బంధువులను వెంటబెట్టుకుని రాష్ట్రంగాని రాష్ట్రం వచ్చింది. అక్కడా సమస్యలు వెంటాడడంతో తిరిగి సొంత రాష్ట్రానికి వెళ్లాలని నిశ్చయించుకుంది. కన్నీళ్లు దిగమింగుకుని .. కడుపునిండా బాధలు నింపుకుని అంబులెన్స్ ఎక్కింది. కొంత దూరం వెళ్లగానే దారికాచిన మృత్యువు ట్యాంకర్ రూపంలో వెంటాడింది. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తతో సహా ఐదుగురి ప్రాణాలను బలితీసుకుంది. పొద్దుపొడవక ముందే జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

- ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్
- ఒడిశాకు చెందిన ఐదుగురు దుర్మరణం
- తవణంపల్లె మండలంలో వేకువజామున ఘటన
- డ్రైవర్ కునుకుతోనే ప్రమాదం?



సంఘటనలో మృతి చెందిన ఒడిశా మృతుల వివరాల కోసం ఫోన్ చేస్తున్న చిత్తూరు సీఐ రవిశంకర్ రెడ్డి

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం.. ఒడిశా రాష్ట్రం కేంద్రపారకు చెందిన ఉమేష్‌చంద్రసాహు(46) యూరిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం భార్య రష్మితసాహు(45), మామ త్రిలోచాన్‌నాయక్(63), సమీప బంధువు బిజయ్‌నాయక్(56)తో కలిసి గురువారం ఒడిశా నుంచి ప్రైవేటు అంబులెన్స్‌లో బెంగళూరులోని ఒక హాస్పిటల్‌కు చేరుకున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. శుక్రవారం వేకువ జామున సుమారు 4.15 గంటల సమయంలో మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను అంబులెన్స్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమేష్ చంద్రసాహు, భార్య రష్మితసాహు, త్రిలోచాన్‌నాయక్, బిజయ్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్లు జాటిన్‌కుమార్ సాహుల్(30) చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. సంజయ్‌కుమార్ జేనా(30), సహాయకుడు దేబబ్రతదాస్(24) స్వల్పంగా గాయపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్ కునుకుపాటే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

ఆధార్ కార్డుల ఆధారంగా గుర్తింపు

సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాలను జేసీబీ సహాయంతో బయటకు తీశారు. లభించిన ఆధార్ కార్డుల ఆధారంగా వారు ఒడిశాకు చెందిన వారుగా గుర్తించారు. వారి బంధువుల ఫోన్ నంబర్లకు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం, మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, యాదమరి ఎస్ఐ సుమన్ పరిశీలించారు. ప్రమాద జరిగిన తీరుపై ఆరా తీశారు. హైవేలో రాత్రి సమయంలో లారీలను పార్కింగ్ చేయకుండా చూడాలని పోలీసులకు సూచనలు ఇచ్చారు.

ఆగి ఉన్న వాహనాలతోనే ప్రమాదం

తవణంపల్లె మండలంలోని తిరుపతి బెంగళూరు జాతీయ రహదారి పట్నం వద్ద ఆరు నెలల కిందట బెంగుళూరు నుంచి స్వగ్రామం గుంటూరుకు వెళ్తున్న కుటుంబం కారు వేకువజామున ఆగిఉన్న పాల ట్యాంకరును ఢీకొంది. ఈ ఘటనలోభార్య, భర్త, కుమారుడు ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. తల్లి ఒడిలో మూడు సంవత్సరాల కుమారుడు చనిపోవడం పలువురిని కలిచి వేసింది. శుక్రవారం జరిగిన ప్రమాదంకు, గతంలో పట్నం వద్ద జరిగిన ప్రమాదానికి మూడు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంది. జాతీయ రహదారిలో లారీలు, ట్యాంకర్లను రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ ఆపేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి ఆరులైన్లు కావడంతో కార్లు వేగంగా వెళ్తుంటాయి. కాని రోడ్డు పక్కన చీకట్లో ఆపి ఉన్న వాహనాలను వేగంగా వెళ్లే వాహనాల డ్రైవర్లు గుర్తించక పోతుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యే సంతాపం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. బయట రాష్ట్రం వారు కాబట్టి వారికి తగు సహాయక చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



ఉమేష్‌చంద్రసాహు



రష్మితసాహు



త్రిలోధాన్‌నాయక్



బిజయ్‌నాయక్